క్లుప్తంగా

బియ్యం, దుస్తులు పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జీవీ మాధవరావు కార్యాలయంలో వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం అందజేశారు. చిలకలూరిపేటకు చెందిన ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు ఏకామూరుతి రామ శర్మ, కార్యదర్శి పోలూరి రామచంద్రమౌళి, కోశాధికారి పావులూరి శేషగిరిరావు అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్ర రావు, చింతలపూడి భద్రతయ్య, చింతకుంట శంకరరావు, దేవులపల్లి విశ్వనాథ శాస్త్రి, అనఘా గోపాలకృష్ణమూర్తి, సుబ్బారావు, సత్యనారాయణ, శ్రీనివాసాచార్యులు, చంద్రమౌళి, మురళీధర్, శంకరరావు, బి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు ఒగ్గు శ్రీనివాసరావు (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల): వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణంలోని నిమ్మలబావి బజారుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఒగ్గు శ్రీనివాస రావు(45) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అమ్మవారికి ఆషాఢ పూజలు



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రతేక అలంకరణలు, విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి సమర్పించారు. సాయినగర్ భక్త బృందం సభ్యులు అమ్మవారికి ఆషాఢ మాస సారేను సమర్పించారు. ఆలయంలోని యాగశాలలో నిర్వహించిన చండీహోమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు పిచికలపాలెంలో జగనన్న సురక్ష

శావల్యాపురం: మండలంలోని పిచికలపాలెం గ్రామ సచివాలయం పరిధిలో ఈనెల 11న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.సీతారామయ్య ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయం పరిధిలో 982 నివాసగృహాలు ఉండగా ఇప్పటి వరకు 730 నివాస గృహాలను 14 మంది వలంటీర్లు ప్రభుత్వ యాప్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. 663 టోకన్లు యాప్‌లో నమోదు 441 సర్వీసులు కుల, ఆదాయ, 1బి అడంగల్, రేషన్ కార్డులు, కుటుంబ విభజన చేయటం సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు సిద్ధం చేశామన్నారు.

మత బోధకుల నూతన కార్యవర్గం

శావల్యాపురం: మండలంలోని క్రైస్తవ మత బోధకుల నూతన కార్యవర్గం ఎంపిక ఆదివారం స్థానిక విమోచన ప్రార్థన మందిరంలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా కోమ్మతోటి ఏసురత్నం, ఉప అధ్యక్షులుగా ఆర్.దానియేలు, సెక్రటరీ బి.జాన్, జాయింట్ సెక్రటరీగా వి.రాంబాబు, ట్రెజరర్‌గా వి.ఏసుపాదం, జాయింట్ ట్రెజరరీగా జాన్ మంగయ్య, ఈసీ సభ్యులు సీహెచ్ రాక్ ప్రశాంత్, వి.ప్రసాద్, కన్వీనర్ ఎస్.మోజేస్, సలహాదారులు జె.బుజ్జిబాబు, ఎం.అజయ్‌పాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సలహాదారులు సీహెచ్. యేహెజ్కేలు తెలిపారు. అనంతరం ఘనంగా సత్కరించారు.

ఫ్రిజ్ కంప్రెషర్ పేలి బాలికకు గాయాలు

నూజెండ్ల: ఫ్రిజ్ కంప్రెషర్ పేలి మంటలు చెలరేగి ఇల్లు ధ్వంసం కాగా బాలిక గాయపడింది. నూజెండ్ల మండలం వి.అప్పాపురంలో ఓ ఇంట్లో ఫ్రిజ్ కంప్రెషర్ పేలి మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతంలో ఉన్న బి.శ్రీలతకు గాయపడింది. ఈ ప్రమాదంలో ఇల్లు ధ్వంసమైంది. స్థానికులు స్పందించి బాలికను కాపాడి 108లో వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విభిన్న ప్రతిభావంతుల క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

గురజాల : విభిన్న ప్రతిభావంతులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని భవిత కేంద్రం ఐఈఆర్టీలు ఏ విజయలక్ష్మీ, బి ఝాన్సీరాణీలు తెలిపారు. ఈనెల 14వ తేదీన గురజాల రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులను పరీక్షించి వారికి అవసరమైన పరికరాలు అందించేందుకు ఈ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు.

• ఖరీఫ్‌కు సన్నద్ధం

యద్దనపూడి: ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఆ గ్రామంలో మొదటిగా ఖరీఫ్ సాగు ప్రారంభం అవుతుంది. పల్నాడు జిల్లా ఉన్నవ గ్రామంలోని రైతులు ఏటా సీజన్‌లో తొలిగానే సాగుకు ఉపక్రమిస్తారు. ఏరువాక పండుగ ముగిసింది... తొలకరి జల్లులు కురిశాయి... నాటి నుంచి గ్రామం పరిధిలో అచ్చుతోలకాలు, విత్తనాలు నాటకోవడంతో రైతులు, కూలీలు సాగు పనులతో బిజీగా ఉన్నారు. ఇప్పటికీ దుక్కులు సిద్ధం చేయని వారు ట్రాక్టర్లతో దుక్కులు చేస్తుండగా, మరో వైపు విత్తు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఓ వైపు కాడెద్దులతో సాళ్లు చేస్తుండగా, మహిళలు పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఆ వెంటనే గుంటుక పోస్తున్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఇంచుమించుగా 8 నుంచి 9 వేల హెక్టర్ల పంటల సాగు చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పత్తి సాగు తగ్గి, మిరప సాగు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.



ఉన్నవ పరిధిలో కాడెద్దులతో పొలం దున్నుతున్న రైతు



బోయపాలెం పరిధిలో ట్రాక్టర్‌తో దుక్కులు చేస్తున్న దృశ్యం



పత్తి విత్తనాలను నాటుతున్న కూలీలు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కలెక్టర్ శివశంకర్

కారెంపూడి: కారెంపూడిలో జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ ఆదివారం పర్యటన ఇతర పర్యటనలకు భిన్నంగా స్ఫూర్తిదాయకంగా సాగింది. నాయకురాలు కనువ వద్ద నాగులేరు వాగును పరిశీలించి వాగు చరిత్ర పూర్వాపరాలను తెలుసుకున్నారు. పల్నాడు ఉత్సవాల సమయంలో పల్నాటి వీరాచారవంతులు నాగులేరును పుణ్యనదిగా భావించి పుణ్యస్నానాలు చేస్తారని, నాగులేరు సహజ సిద్ధ నీటి బుగ్గలుండేవని ఇప్పుడు నాగులేరులో నీరు లేని పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు విజ్ఞానదాయకంగా పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.

పర్యావరణ పరిరక్షణకు కొమెర అంకారావు (జాజి)ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికారు. వృక్షాలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని పర్యావరణాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని విద్యార్థులకు చాలా బలంగా వివరించారు. జాజి పర్యావరణ పరిరక్షణ కోసం చేస్తున్న కృషిని అభినందించి ఆయనను సన్మానించారు. మనకు మన పరిసరాలలో ఉన్న ప్రతి మొక్కపై అవగాహన ఉండాలని అవి అంతరించి పోకుండా చూసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వ పరంగా ఏ సాయం అందిస్తామన్నా వద్దు అని తానొక్కడే ఎంతో శ్రమకోర్చి ప్రజలందరికి మేలు చేకూర్చే పర్యావరణ పరిరక్షణ కోసం జాజి ఏళ్ల తరబడి చేస్తున్న కృషి నిజంగా అభినందనీయమని చెప్పారు. ఆయన ఏదో ఒక రోజు అత్యుత్తమ పురస్కారాన్ని అందుకోవడం ఖాయమన్నారు. ప్రస్తుతం పర్యావరణానికి జరుగుతున్న హానిని గమనించి జాజి మొక్కలు పెంచడంపై దృష్టి సారించాలని అలాగే ప్రతి ఒక్కరూ ఆలోచన చేస్తే పర్యావరణానికి హాని జరగదన్నారు. మనం పడేసిన వ్యర్థాలను అడవి నుంచి ఏరుతున్న జాజికి ఆ పని లేకుండా ఎవరు వాడిన వాటిని వారే వాటన్నింటిని కవర్లో వేసి పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది సేకరించాలనే చూడాలన్నారు. పక్షుల ఆహారం కోసం జాజి కేటాయించిన 80 సెంట్ల పొలంలో కలెక్టర్ సజ్జ జొన్న విత్తనాలు చల్లారు. ఆ తర్వాత అతని ఇంటికి కలెక్టర్ వెళ్లి జాజి స్థితిగతులను తెలుసుకున్నారు. రోజువారీ విధుల్లో క్షణం తీరికలేకుండా గడిపే కలెక్టర్ ఇలా పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో చైతన్యం కలిగించే వినూత్న కార్యక్రమం అందులోనే ఎవరూ చేయని విధంగా నల్లమల అడవిలో అధికారులు విద్యార్థులతో కలియ తిరిగి స్వయంగా కలెక్టరే విత్తనాలు చల్లే కార్యక్రమంలో పాల్గొని అందరిలో పర్యావరణ పరిరక్షణ స్ఫూర్తిని రగిలించారు.



పక్షుల ఆహారం కోసం విత్తనాలు చల్లుతున్న కలెక్టర్ శివశంకర్



జాజిని సన్మానిస్తున్న కలెక్టర్ శివశంకర్

అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యే పీఆర్కే

కారెంపూడి: ఇటీవల మండలంలోని ఒప్పిచర్లలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తు సామగ్రితో పాటు సొత్తు కూడా కాలిపోయిన పేద బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం పరామర్శించి రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు. ఒప్పిచర్ల గ్రామంలోని రోడ్డు మీద ఎస్సీ కాలనీకి చెందిన మిద్దెపోగు యాకోబు నివాసం గృహంలోని సామగ్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా కాలిపోయాయి. దీంతో బాధితుడు యాకోబు ఇంటికి ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. యాకోబు కుటుంబం ప్రభుత్వ విప్ పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పంగులూరి చిన వెంకటనర్సయ్య, గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణ కొండలు, మాజీ ఎంపీటీసీ ఓగూరి రామయ్య, మాజీ సర్పంచి రామదేని ఆంజనేయులు, ఇరికెదిండ్ల లాజర్, ఎస్సీ నాయకులు మిద్దెపోగు పున్నయ్య పాల్గొన్నారు.



బాధిత కుటంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి

మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తా

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి: ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని గురజాల శాసన సభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. కేఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. మొదటి బహుమతిని దాచేపల్లి డాన్ డైనిమాట్రి నిలిచింది. రెండో బహుమతిని చెర్రి ఎలయన్స్, మూడో బహుమతిని దాచేపల్లి హనుమాన్ సీసీ, 4వ బహుమతిని పిడుగురాళ్ల సాక్టో సీసీ సాధించాయి. విజేతలైన జట్లకు ఎమ్మెల్యే కాసు చేతుల మీదుగా ఆర్అండ్‌బీ బంగ్లాలో బహుమతులు శనివారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ...పల్నాడు ప్రాంతంలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఎంతోమంది ఉన్నారని, వీరి ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని చెప్పారు. ఈ ప్రాంతంలో ఉన్న క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని, మినీ స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్రభుత్వం అందించిన అవకాశాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని రాణించాలని ఎమ్మెల్యే కాసు కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ కోట కృష్ణ, మాజీ కన్వీనర్ షేక్ జాకీర్‌హుస్సేన్, మాజీ సర్పంచులు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, శ్రీరాం పోలు, నాగుబండి గురువులు, మందపాటి వీరారెడ్డి, నాయకులు కొప్పుల రవికుమార్, కల్లూరి లింగయ్య పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

వైరస్‌లను తట్టుకునే రకాలను రైతులు వేసుకోవాలి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి, మిరప పంటలను సాగుచేసే రైతులు వైరస్ తెగుళ్లను తట్టుకునే రకాలకు చెందిన కంపెనీ విత్తనాలతో పంటలను వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పత్తి, మిరప పంటల సాగులో తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పత్తి పంటకు ఎక్కువగా గులాబిరంగు పురుగు తీవ్రనష్టం కలిగిస్తుందన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు గులాబిరంగు పురుగు నివారణకు పిచికారీ మందులను వాడుకోవాలన్నారు. మిరపను సుమారు 82 రకాల వైరస్‌లు ఆశించి నష్టపరుస్తాయని మూడేళ్లుగా పలు జిల్లాలలో మిరప పంటకు ఈ తెగుళ్లు ఆశించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మన రాష్ట్రంలో ఆకు ముడత, కుకుంబర్ మొజాయిక్ వైరస్, మొవ్వకుళ్లు వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ముందుగా పంటపొలంలో భూ పరీక్షలు చేయించుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నా యన్నారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని, సేంద్రీయ ఎరవులను వాడి సమతూల్య ఎరువుల యాజమాన్యం పద్ధతులు పాటించిన అధిక దిగుబడులు సాధించవచ్చ న్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల చెందిన మూడు, నాలుగు రకాల విత్తనాలను రైతులు కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించడం వలన తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడులను సాధించవచ్చునని పేర్కొన్నారు.

నేటితో ముగియనున్న సామాజిక తనిఖీల ప్రక్రియ

యద్దనపాడు: ఉపాధి పనులు నిర్వహణ ప్రక్రియను సామాజిక తనిఖీ బృందాలు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నాయని ఎంపీడీఓ వై.హనుమారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ యద్దనపాడు మండలం పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గృహ నిర్మాణశాఖ, వివిధ రకాల పంట కాలువలో పూడిక తీత పనులు, మైనర్ ఇరిగేషన్ చెరువులు, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పనులు నిర్వహించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయా పనుల పరిశీలనకు తనిఖీ బృందాలు గతనెల 29న మండలానికి వచ్చాయన్నారు. వీరిలో రాష్ట్ర సీఆర్పీ బుజ్జి ఆధ్వర్యంలో 8 మంది డీఆర్పీలు కలసి మండలంలోని పరిధిలో 18 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పథకం ద్వారా నిర్వహించిన పనుల్ని స్వయంగా తనిఖీలు చేస్తున్నారని వెల్లడించారు. సోమవారం సాయంత్రం నాటికి క్షేత్రస్థాయి తనిఖీలు ముగిస్తాయన్నారు. మరుసటి రోజు మంగళవారం యద్దనపాడు గ్రామంలోని ప్రజా పరిషత్ మండల కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు ప్రజావేదిక ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల: సాతులూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. సాతులూరు, చందవరం, గొరిజవోలు, డెయిరీ ఇండస్ట్రీ, దొండపాడు, పానుగుపాడు గ్రామాల్లో గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు గుట్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

బొల్లాపల్లి: మండలంలోని గుట్లపల్లి గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు హాజరవుతారని చెప్పారు.


టైఫాయిడ్ టీకా శిబిరం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన వెలమవారిపాలెంలో ఉచిత టైఫాయిడ్ టీకా శిబిరం ఆదివారం నిర్వహించారు. దాతల సహకారంతో నిర్వహించినట్లు బొల్లాపల్లి మండల ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజరు సంద్రపాటి చలపతిరావు చెప్పారు. కార్యక్రమంలో దాత మధురాంతకం ప్రసాద్‌బాబు, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఎస్.పరమేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్త కేవీ శేషుకుమారి పాల్గొన్నారు.

నేడు సాతులూరులో జగనన్న సురక్ష

నాదెండ్ల: సాతులూరు-2 సచివాలయంలో జగనన్న సురక్ష సోమవారం నిర్వహించనున్నట్లు కార్యక్రమం కన్వీనర్ అల్లడి రవికుమార్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీఓ జాకీర్‌హుసేన్ పాల్గొంటారని తెలిపారు.

పోలేరమ్మకు బోనాలు



గురజాల: వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పంటలు బాగా దిగుబడి వచ్చి ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ఆషాఢమాసం మూడవ ఆదివారంను పురస్కరించుకుని పోలేరమ్మకు బోనాలు సమర్పించారు. మండల పరిధిలోని జనార్ధనపురం గ్రామంలోని ప్రజలు పోలేరమ్మకు పొంగళ్లు సమర్పించారు. రాఘవాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పోలేరమ్మ దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోల్డ్ స్టోరేజీ ప్రారంభానికి సిద్ధం

సొసైటీ చైర్మన్ చెన్నయ్య

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు నిధులు రూ.6 కోట్లతో నిర్మిస్తున్న శీతల గిడ్డంగి భవన నిర్మాణ పనులు తుది దశకు చేరినట్లు సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య ఆదివారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సహకారంతో నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. మండలంలోని వేల్పూరులో మూడు వేల టన్నులు సామర్థ్యం కలిగిన భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరగా ఆగస్టు నెలఖారులో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదగా ప్రారంభోత్సవం చేయనున్నట్లు వివరించారు. అలాగే రైతులు పండించిన పంటలను నిల్వ ఉంచేందుకు ప్రభుత్వ పరంగా 1000 మెట్రిక్ టన్నులు రూ.75 లక్షల వ్యయంతో చేపట్టిన గోదాం నిర్మాణ పనులు పూర్తి అయినట్లు చెప్పారు. మండలంలోని కొత్తలూరు 500 టన్నులు సామర్థ్యంతో రూ.40 లక్షల వ్యయంతో గోదాం పనులు జరుగుతున్నాయన్నారు.



శీతల గిడ్డంగి భవనం

రీజినల్ గేమ్స్‌కు కేవీ విద్యార్థులు

నాదెండ్ల: గణపవరం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఈ నెల 11 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించనున్న స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రీజినల్ స్థాయి ఆటల పోటీలకు హాజరు కానున్నట్లు ప్రిన్సిపాల్ సాతులూరి విజయ్‌కుమార్ తెలిపారు. అథ్లెటిక్స్ విభాగం రన్నింగ్‌లో 100, 400, 1000, 4000 మీటర్ల దూరం, షాట్‌పుట్, డిస్కస్ త్రో, స్పోర్ట్స్ విభాగంలో ఖోఖో, షటిల్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలకు 53 మంది ఎంపికైనట్లు చెప్పారు. సోమవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్ళి పోటీలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న క్రీడాకారులు రీజనల్ స్థాయిలో పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని పీఈటీ నీలయ్య తెలిపారు.



క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రహదారులకు మహర్దశ

- రూ.13 కోట్ల 40 లక్షలు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభం

గురజాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రహదారులను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి చొరవతో రహదారుల ఏర్పాటుకు మరమ్మతులు చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బీ రహదారులకు మహర్దశ పట్టనున్నాయి. అధ్వానంగా ఉన్న రహదారులను గుర్తించి ఆర్అండ్‌బీ అధికారులతో మరమ్మతులు చేసే విధంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారు. గత ప్రభుత్వం హయాంలో ఏ రోడ్డు చూసినా గుంతల మయంగా దర్శనమిచ్చేవి. అటువంటి రోడ్లును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అద్దంలా తీర్చిదిద్దనున్నాయి. గత పాలకులు నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరిన రహదారులకు మరమ్మతులు చేసి బాగుపరిచేందుకు ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేస్తుంది. నియోజకవర్గంలోని పలు ఆర్అండ్‌బీ రహదారులు మోక్షం కలిగించే విధంగా చర్యలు చేపట్టారు.



అధ్వాన్నంగా ఉన్న పిన్నెల్లి టు లక్ష్మీపురం ఆర్ అండ్ బీ రోడ్డు


అభివృద్ధి చేసే రహదారులు

- పిడుగురాళ్ల మండలంలోని గుళ్లపల్లి టు జూలకల్లు గ్రామం వరకు రూ.4 కోట్లు
- జానపాడు టు పందిటివారిపాలెం వరకు రూ.1 కోటి 50 లక్షలు
- ఎన్నెల్లి గ్రామం టు లక్ష్మీపురం వరకు (తుమ్మల చెరువు చెట్టు వరకు రూ.1 కోటి 20 లక్షలు
- దాచేపల్లి నగర పంచాయతి నుంచి తంగెడ గ్రామం కృష్ణానది వరకు రూ.5 కోట్ల 70 లక్షలు
- కాచవరం టు దాచేపల్లి నగర పంచాయతీ వరకు కేసానుపల్లి మీదుగా రూ. కోటి రూపాయలు

శాకంబరి అలంకారంలో శ్రీ వాసవి మాత



శాకంబారి అలంకారంలో శ్రీ వాసవి అమ్మవారు



దేవాలయ ప్రాంగణంలో కూరగాయలతో అలంకరణ చేసిన దృశ్యం

మాచర్ల: ఆషాఢమాస సందర్భంగా పట్టణంలోని పాత మాచర్లలో వేంచేసియున్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారిని వేలాది కూరగాయలతో శాకంబరిగా అలంకరించిన అనంతరం భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆలయ అధ్యక్షులు చందోలు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆర్య వైశ్య మహిళలు ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అమ్మవారిని అలంకరించి అర్చకులు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 10.30గం ''లకు ధూపదీప నైవేద్యాలతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా దేవాలయంలో వినాయకుడు, శివుడు, వెంకటేశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలను కూరగాయలతో అలంకరించి ప్రాంగణంలో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.